అడుగడుగునా అభివృద్ధి

- రూ.1.48 కోట్లతో అభివృద్ధి పనులు
- రేపు ప్రారంభోత్సవాలు


సొసైటీ సమీపంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్


ఉయ్యాలవాడలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంకు


ఉయ్యాలవాడలో హిందూ శ్మశాన వాటిక వరకు నిర్మించిన సీసీ రోడ్డు

ఉయ్యాలవాడ: ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సఫలీకృతమైంది. కొన్నేళ్లుగా వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం చూడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మంచినీరు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేక మండల కేంద్రం ఉయ్యాలవాడలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శాశ్వ పరిష్కారం కోసం పనులు చేయించింది. ప్రస్తుతం పనులు పూర్తవడంతో ఈనెల 21న వాటిని ప్రారంభించేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు.

పనులు ఇలా..

నాలుగు సంవత్సరాల కాలంలో రూ.1.48 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు జరిగాయి. పూర్తయిన వాటిని ప్రారంభించేందుకు అధికారులు ఈ నెల 21వ తేదీన ముహూర్తం ఖరారు చేశారు. ఎంపీ ల్యాండ్ నిధులతో రూ.75 లక్షలతో 1.20 లక్షలు, 40 వేల లీటర్ల సామర్థ్యంతో రెండు ఓవర్ హెడ్‌ట్యాంకులు, స్థానిక సహకార సంఘం సమీపంలో రూ.30 లక్షలతో కూరగాయల మార్కెట్, ఎస్సీ కాలనీ, హిందూ శ్మశాన వాటికకు వెళ్లే అంతర్గత రహదారులను రూ.30 లక్షలతో నిర్మించారు. అలాగే ఎస్సీ కాలనీలో రూ.13 లక్షలతో మురుగు కాలువల నిర్మాణం పూర్తయ్యింది.

నీటి సమస్యకు చెక్..

గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉండింది. ప్రస్తుతం రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నూతనంగా నిర్మించడంతో ఇక నీటి కష్టాలు తీరనున్నాయి. కూరగాయల మార్కెట్ ఏర్పాటు కావడంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రతి బధవారం సంతలో వ్యాపారాలు నిర్వహించుకునే వారికి వసతి దొరుకుతుంది. కాలనీల్లో అంతర్గత రహదారులు మెరుగు పడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మరో రూ.కోటితో స్థానిక మోడల్‌స్కూల్ సమీపంలోని బీసీ కాలనీ, కోట వీధిలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించారు.

మంచినీటి కష్టాలు తొలిగాయి



కాలనీలో 110 గృహాలకు చెందిన వారు గత పదేళ్లుగా మంచినీటి కష్టాలు ఎదుర్కొన్నాం. మోడల్ స్కూల్ సమీపంలో నూతనంగా ట్యాంకు నిర్మించడంతో పాఠశాల విద్యార్థులతో పాటు తమ కాలనీకి మంచి నీటి కష్టాలు తొలిగాయి. ప్రస్తుతం మురుగు కాలువల నిర్మాణం జరుగుతోంది. పూర్తియితే మురుగు నీటి సమస్య కూడా పరిష్కారమవుతుంది.

– ఎద్దుల గురప్ప, బీసీ కాలనీ, ఉయ్యాలవాడ

గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి



గ్రామంలో గతంతో పోలిస్తే ఎన్నడూ లేనంతగా అభివృద్ధి ఇప్పుడు జరుగుతోంది. ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేస్తున్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్వగ్రామం కావడంతో సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతుండటం సంతోషకరం. అభివృద్ధి పనులు పూర్తి కావడంతో గ్రామానికి కొత్త కళ వచ్చినట్లు ఉంది.

– మేకల ఓబులేస్, గ్రామ సర్పంచ్

పీఎంశ్రీ పథకానికి ఎంపిక

ఉయ్యాలవాడ: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్ పీఎం శ్రీ పథకానికి ఎంపికై ందని ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 56 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగా, అందులో తమ స్కూల్ ఉందని చెప్పారు. ఈ పథకం ద్వారా కొత్త జాతీయ విద్యా విధానం అమలుతో పాటు విద్యార్థులకు అవసరమైన మరిన్ని వసతులు, తరగతి గదుల్లో ఆన్‌లైన్ వ్యవస్థ మెరుగు పడుతుందని చెప్పారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

దొర్నిపాడు: రానున్న ఖరీఫ్‌లో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం పై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. భూ పరీక్ష–శిక్షణ వారం కార్యక్రమంలో భాగంగా బుధవారం కొండాపురం గ్రామ సచివాలయ పరిధిలోని అమ్మిరెడ్డినగరం గ్రామంలో మట్టి నమూనాల సేకరణ–భూ పరీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల నేల సారవంతం తెలుస్తుందని, అందుకనుగుణంగా పంటలు సాగు చేయవచ్చన్నారు. అలాగే మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చన్నారు. ఏ పంట సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ పెద్దయ్య, ఎంపీఈఓ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెంచు మహిళలకు న్యాయం చేస్తాం


హరినగరంలో చెంచు మహిళలతో సమావేశమైన ఉద్యోగులు

రుద్రవరం: బుక్ కీపర్ తిరుపాల్ ద్వారా నష్టపోయిన చెంచు మహిళలకు న్యాయం జరిగేలా చూస్తామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రసాద్ తెలిపారు. సీసీ,బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలి అనే శీర్షిక బుధవారం సాక్షిలో ప్రచురితం కావడంతో వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది స్పందించారు. వెంటనే ఏపీఎం ప్రసాద్ కొత్త సీసీ చంద్రపాల్‌తో కలిసి గ్రామానికి వెళ్లి గ్రామైక్య సంఘంలోని పలు పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి, ఇతర రుణాలకు సంబంధించి మహిళలతో చర్చించి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బుక్ కీపర్ తిరుపాల్ ఆయా పొదుపు సంఘాల మహిళల స్త్రీనిధి సొమ్ము దాదాపు రూ.62 వేలు వాడుకున్నట్లు తేలిందని, ఆ మొత్తం కాక ఆ గ్రూప్ సభ్యులు ఇంకా రూ. 45వేల దాకా చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తాన్ని చెల్లిస్తే తిరుపాల్ ద్వారా మిగిలిన మొత్తం చెల్లింపజేయించి బకాయి లేకుండా చేస్తామని చెప్పారు.

'బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం'


ప్రచార భేరీలో మాట్లాడుతున్న తోటమద్దులు

నంద్యాల(అర్బన్): ప్రజావ్యతిరేక, మతోన్మాద, నిరంకుశ పాలనను అందిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని సీపీఎం సీనియర్ నాయకుడు తోట మద్దులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ పట్టణంలోని అమ్మవారిశాల బైర్మల్ స్ట్రీట్, రోజాకుంట ప్రాంతాల్లో వామపక్ష పార్టీల నాయకులు ప్రచార భేరీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన ప్రచార భేరీ యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. నాయకులు ప్రసాదు, పుల్లా నరసింహులు, సోమన్న, ధనుంజయ్, వెంకట్‌లింగం, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: గ్రామల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంతో పాటు ఆర్.నాగులవరం,ముత్తలూరు తదితర గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్, ఆయుష్మాన్ భారత్, ఎస్‌డీజీ సర్వేలకు సంబంధించిన రిపోర్టులను పరిశీలించారు. ఆయన ఆయా గ్రామాల్లో ప్రజలకు ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు ఇది మంచి అవకాశమని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలకు వెళ్లి మార్పులు చేర్పులు చేయించుకోవాలని చెప్పారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించి కూలీలకు పనిదినాలు పెంచాలని, ఉదయాన్నే పనులకు వెళ్లి 10 గంటలలోపు ఇళ్లకు తిరిగి వచ్చేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రంజాన్ కిట్ల పంపిణీ


వృద్ధురాలికి సరుకులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాల్ అమీర్ ఆధ్వర్యంలో స్థానిక గట్బాల్ నగర్‌లో బుధవారం దాదాపు 500 మంది పేద కుటుంబాలకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శిల్పా మహిళా సహకార బ్యాంకు చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సతీమణి శిల్పా నాగిని రెడ్డి పాల్గొని గాంధీనగర్, గట్బాల్‌నగర్, బొగ్గులైన్, మూలసాగరం తదితర ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పేదలకు సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

తాత్కాలికంగా డెమో రైలు రద్దు

డోన్ టౌన్ : డోన్ నుంచి కర్నూలుకు వెళ్లే మార్గంలో ఉన్న బోగోలు రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాక్ మరమ్మతుల కారణంగా డెమో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డోన్ స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. నంద్యాల నుంచి కర్నూలుకు వయా డోన్ మీద వెళ్లే 07498, కర్నూలు నుంచి డోన్ మీదుగా గుంతకల్ వెళ్లే డెమో రైళ్లను గురువారం నుంచి ఈ నెల 28వ తేది వరకు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. నంద్యాల నుంచి వచ్చే రైళ్లు డోన్ వరకు వచ్చి అక్కడి నుండి పాత కాలమానం ప్రకారం గుంతకల్‌కు వెళ్తాయన్నారు. అలాగే డోన్ – గుంటూరు, గుంటూరు– డోన్ రైళ్లు (నంబరు17227–17228) డబుల్‌లైన్ పనుల కారణంగా గతంలోనే చిన్న మల్కాపురం, రంగాపురం గ్రామాల్లో ఆగకుండా తీసుకున్న నిర్ణయాన్ని పొడిగిస్తూ ఈ నెల 30వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పెద్దయమ్మనూరు, కాకరవాడ గ్రామాల మధ్య కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె, హరివరం, సర్వాయిపల్లె, పెద్దయమ్మనూరు, కాకరవాడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులను ఏపీడీ సాంబశివరావు బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజువారి కూలీల టార్గెట్ 3000 కాగా, ప్రసుత్తం 1,717 మంది మాత్రమే పనుల్లో పాల్గొనడంపై సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రోజువారి కూలి రేటు రూ. 272కు పెంచిందన్నారు. ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సర్వాయిపల్లె, హరివరం, తుడుమలదిన్నె గ్రామాల్లో కూలీల సంఖ్య తక్కువగా ఉందని పెంచాలని, అలాగే మే నెలలో పూడికతీత పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ రవిప్రకాష్‌కు సూచించారు.

జ్వరాల నియంత్రణపై అవగాహన

గోస్పాడు: మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మలేరియా జ్వరాలు – నియంత్రణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమలు కుట్టడం వలన మలేరియాతో పాటు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

హస్త కళాకారులను ప్రోత్సహించండి


ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డికి గౌతమ బుద్ధుడి ప్రతిమను అందిస్తున్న దృశ్యం

నంద్యాల: లేపాక్షి హస్తకళాకారులను ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి కోరారు. బుధవారం నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి హస్త కళాకారులు తయారు చేసిన గౌతమ బుద్ధుడు ప్రతిమను ఎంపీకి బహూకరించారు. ఆమె మాట్లాడుతూ లేపాక్షి ఎంపోరియాల ద్వారా తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేసి హస్త కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, కర్నూలు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): నంద్యాల – జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణం కోసం రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ కోరారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం నంద్యాల మండలంలోని కానాల, రైతునగర్ గ్రామాల్లో పేద రైతుల భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. రహదారి ఏర్పాటవుతున్న ఆయా గ్రామాల్లో నాయకులు బుధవారం సంబంధిత రైతులతో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో భూసేకరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రామచంద్రుడు, ఉశేన్ వలి, యూసుఫ్, రైతులు ఉన్నారు.

రైతుల కోసమే ఆర్‌ఓ ప్లాంట్


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మహేశ్వరరెడ్డి

నంద్యాల(అర్బన్): మార్కెట్ యార్డుకు పంట దిగుబడులు తెస్తున్న రైతులకు స్వచ్ఛమై తాగునీరు అందించాలని ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశామని మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి తెలిపారు. యార్డులో రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును బుధవారం యార్డు కార్యదర్శి కల్పన, అసిస్టెంట్ కార్యదర్శి శేషిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో యార్డు సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- స్పందనలో అర్జీలు ఎక్కువగా వస్తున్న శాఖలను గుర్తించండి
- త్వరలో జిల్లాలో పర్యటించనున్న ప్రత్యేక అధికారులు
- ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ, ఇతర అధికారులు

నంద్యాల: ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్తి స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శామూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రారంభానికి తీసుకోవలసిన అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించామని ప్రత్యేక ముఖ్య కార్యదర్శికి వివరించారు. సచివాలయాల్లో మెరుగైన పనితీరు, స్పందన కార్యక్రమ పటిష్ట నిర్వహణ, ప్రజలు సంతృప్తి చెందేస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. గ్రామ,వార్డు సచివాలయాల్లో వందశాతం బయోమెట్రిక్ హాజరు,స్పందన కార్యక్రమం బలోపేతం చేయడానికై తీసుకోవలసిన చర్యలపై అధికారులను ఆదేశించామన్నారు. అంతకు ముందు పూనం మాలకొండయ్య మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి రెవెన్యూ, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పట్టణాభివృద్ధి, హోం, వైద్య ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం తదితర ఐదు శాఖలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే జిల్లాల్లో కూడా స్పందనలో అర్జీలు ఎక్కువగా వస్తున్న మొదటి ఐదు శాఖలను గుర్తించాలని ఆదేశించారు. రెవెన్యూ, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గృహ నిర్మాణం తదితరాల్లో తరచూ క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల సమస్యలను మెరుగ్గా పరిష్కరిస్తున్నారా లేదా, తీసుకోవలసిన చర్యలు తదితరాలపై పరిశీలించడానికి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించిందని చెప్పారు. వీరు త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులు ప్రసవాల లక్ష్యాన్ని చేరుకోవాలి

సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, జిల్లా ఆసుపత్రిలో లక్ష్యం మేరకు ప్రసవాలు జరిగేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల పరిధిలో హైరిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రసవ తేదీ కంటే ముందే ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేయాలని చెప్పారు. బ్లడ్ బ్యాంకులను రిజిస్టర్ చేసుకొని బ్లడ్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఎన్‌సీడీ–సీడీ సర్వే వేగవంతం చేసి గడువులోపు నివేదికలు ఇవ్వాలని కోరారు. ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు, ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


మహానందిలో వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్

మహానంది: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించినా కఠినచర్యలు తప్పవని మహానంది ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానంది ఎస్‌ఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్‌ఐ సీసీ నాగార్జునరెడ్డి వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో మద్దికెర నుంచి నాగేంద్రప్రసాద్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన ముందుగా శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- వెంకన్న ఆశీస్సులతో ధర్మపరిరక్షణే ధ్యేయంగా దేవాలయాల నిర్మాణం
- టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఒక్కో గుడికి రూ.10 లక్షలు
- జిల్లాకు రెండు విడతల్లో 16 ఆలయాలకు మంజూరు


అవుకు మండలం గడ్డమేకలపల్లెలో ప్రారంభమైన రామాలయం

కొలిమిగుండ్ల: పురాతన ఆలయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆలయాల పునిర్మిణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. అదేవిధంగా కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో హిందూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించి ప్రజల్లో భక్తి భావం పెంపొందించే దిశగా టీటీడీ ముందుకు సాగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ఆలయాల నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధుల కేటాయింపు జరుగుతుంది. ఒక్కో ఆలయానికి శ్రీవాణి ట్రస్ట్ రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుంది. శ్రీవారి వైభవం నలుదిశలా వ్యాప్తి చేసేందుకు టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్, సమరసత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ ధర్మాన్ని ప్రతిఒక్కరూ గౌరవించేలా హిందూ ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొత్త ఆలయాలు నిర్మించి నిత్యం దూపదీప నైవేద్యాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దైవాన్ని భక్తి శ్రద్ధలతో కొలుచుకోవాలని ఆశించిన వర్గాల వారికి వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పల్లెల్లోనే ఇష్టమైన దేవాలయం నిర్మించుకునే అవకాశం కల్పించింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా జిల్లాకు రెండు విడతల్లో 16 ఆల యాలకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో గడ్డమేకలపల్లె, యాగంటిపల్లె, బుగ్గానపల్లె, కమల పురి, శెట్టివీడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావ డంతో కొద్ది రోజుల క్రితం ఆలయాలను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

చురుగ్గా సాగుతున్న ఆలయాల నిర్మాణాలు

తిరుమలలోని ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రపంచంలోనే ధనిక హిందూ దేవాలయంగా ప్రసిద్ధికెక్కింది. దేశవ్యాపంగా స్వామిని దర్శించుకునేందుకు లక్షల్లో వచ్చే భక్తులు నగదు, కానుకలు భారీగా సమర్పించుకుంటుంటారు. అందుకే వెంకన్నను అపరకుబేరుడిగా పిలుస్తుంటారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత ఫౌండేషన్ సహకారంతో పల్లెల్లో నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ముందుగా గుడికి కావాల్సిన స్థల సేకరణ చేపడుతారు. ఆయా వర్గాలకు చెందిన 15 మందితో కమిటీ ఏర్పాటు అయ్యాక ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలను దశల వారీగా కమిటీకి చెందిన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. కొత్తగా నిర్మించే ఆలయాల్లో నిత్య పూజలు నిర్వహించేందుకు అర్చకత్వంలో శిక్షణ ఇప్పించనున్నారు. ప్రధానంగా మారు మూల గ్రామాల్లో సీతారామాలయం, వేంకటేశ్వరస్వామి, మారెమ్మ, జంబులాపరమేశ్వరి, చెన్నకేశవస్వామితో పాటు గ్రామ దేవతల ఆలయాలు నిర్మించనున్నారు. ఆలయ పనులు మొదలు పెట్టిన పది నెలల్లో పూర్తి చేసేందుకు టీటీడీ చర్యలు చేపడుతుంది. జిల్లాలో మరో 22 ఆలయాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపారు.

జిల్లాకు మంజూరైన ఆలయాల వివరాలు

మండలం	గ్రామం పేరు
కొలిమిగుండ్ల	పెద్దవెంతుర్ల
అవుకు	గడ్డమేకలపల్లె
బనగానపల్లె	యాగంటిపల్లె
సంజామల	కమలపురి
బేతంచెర్ల	బుగ్గానపల్లె
చాగలమర్రి	శెట్టివీడు
నంద్యాల	వైఎస్ఆర్ నగర్ బుడగ జంగాల కాలనీ
నంద్యాలరూరల్	పోలూరు
బండిఆత్మకూరు	కాకనూరు
ఆత్మకూరు	అమలాపురం
గడివేముల	కొరటమద్ది
జూపాడుబంగ్లా	మండ్లం
జూపాడుబంగ్లా	తర్తూరు
మహానంది	గాజులపల్లె
రుద్రవరం	కోటకందుకూరు
కోవెలకుంట్ల	చిన్నకొప్పెర్ల

హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఆలయాల నిర్మాణం



హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఆలయాల నిర్మాణం సాగుతుంది. ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో చాలా వరకు హిందూ ఆలయాలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్, సమరసత ఆధ్వర్యంలో కొత్తగా ఆలయాలు నిర్మాణాలు సాగుతున్నాయి. ఆలయాలు నిర్మాణం పూర్తయ్యాక అక్కడే బాల వికాస కేంద్రాలు ఏర్పాటు చేసి పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రతి రోజు రెండు గంటల పాటు కార్యక్రమాలు చేపడుతాం. జిల్లాలో ఆలయాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

– శ్రీనివాసులు, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ: వైద్యశాలల్లో అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వీరారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఓ ప్రైవేట్ వైద్యశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ పేలుడు జరిగినప్పుడు ఏవిధంగా మంటలను అదుపు చేయాలో డెమో ద్వారా వివరించారు.

గడ్డివామి దగ్ధం

శిరివెళ్ల: కోటపాడుకు చెందిన వెంకట సుబ్బయ్య గడ్డి వామి దగ్ధమైంది. మంగళవారం రాత్రి ఎస్సీ కాలనీలో ఒక్కసారి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు గమనించి ఆళ్లగడ్డ అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేసింది. ఈ ప్రమాదంలో 6 ఎకరాల వరి గడ్డి దగ్ధమైందని, రూ.80 వేల నష్టం జరిగిందని రైతు వాపోయాడు.కాగా అగ్ని ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నంద్యాల(వ్యవసాయం): మే 4వ తేదీన పౌర్ణమి పురస్కరించుకుని నంద్యాల డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మే 4న ఉదయం సూపర్ డీలక్స్ బస్సు బయలు దేరుతుందన్నారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. నంద్యాల నుంచి అరుణాచలం రాను పోనూ చార్జీ రూ.1,730 చెల్లించాలన్నారు. అలాగే కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, ఇతర దేవస్థానాలను సమయాన్ని బట్టి దర్శనం చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బస్సు 4న ఉదయం బయలుదేరి 6వ తేదీ ఉదయం నంద్యాలకు వస్తుందని, అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.